

రోడ్డు భద్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపిఎస్‌ఆర్‌టిసి రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం కోసం శుక్రవారం ఏలూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎన్‌వివిఆర్.వరప్రసాద్ మాట్లాడుతూ రోడ్డుపై వాహనాన్ని నడిపేటప్పుడు పూర్తిస్థాయి అవగాహనతో ఉండాలన్నారు. ప్రశాంతంగా వాహనాన్ని నడపాలని సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి మాట్లాడుతూ డ్యూటీకి వెళ్లే ముందు ఆయా రూట్లల్లో ఉన్నటువంటి ప్రమాద స్థలాలను ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. తగినంత విశ్రాంతి తీసుకోవడం చాలా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ పి.ప్రేమ్‌కుమార్, ఎఎంటి బి.మురళి, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇంటి 'స్థలం' ఇరకాటం..!



వేగంగా జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ

మృతి చెందిన లబ్ధిదారుల స్థలాలపై ఎటూ తేల్చని పరిస్థితి

వారసులకు ఇచ్చేందుకు ఆప్షన్ లేదంటున్న అధికారులు

ఉపాధికై ఇతర దేశాలకు వెళ్లిన మహిళల కుటుంబాల పరిస్థితీ అంతే

రెండు జిల్లాలో పది వేల మందికిపైగా 'స్థల' బాధితులు

ప్రభుత్వ నిర్ణయం తీసుకోవాలంటున్న లబ్ధిదారుల వారసులు

జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో లబ్ధిదారుల కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. దీంతో వేలాది ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కాకుండా ఆగిపోయిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ నిర్లక్ష్యంపై లబ్ధిదారుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లో దాదాపు రెండు లక్షల ఇళ్ల స్థలాలను పేదలకు పంపిణీ చేసినట్లు ప్రభుత్వం లెక్కలు చెబుతోంది. పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం చొప్పున కేటాయించింది. గతంలో ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలు ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చింది. ఇప్పుడు ఎన్నికల ముందు జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. రెవెన్యూ యంత్రాంగమంతా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై దృష్టి సారించింది. ఈ ప్రక్రియలో అనేక సమస్యలు అధికారులను వెంటాడుతున్నాయి. లబ్ధిదారుల నుంచి వస్తున్న ప్రశ్నలకు అధికారులు సమాధానాలు చెప్పలేని పరిస్థితి ఉంది. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వస్తున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడమే దీనికి కారణం. ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి పట్టాలు అందించిన తర్వాత అనేక మంది లబ్ధిదారులైన మహిళలు వివిధ ఆరోగ్య సమస్యలతో మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. అంతేకాకుండా జీవనోపాధి కోసం అనేకమంది మహిళలు గల్ఫ్ దేశాలకు వెళ్లారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలు మృతి చెందిన, గల్ఫ్ దేశాలకు వెళ్లిన మహిళల పేరుపైనే ఉన్నాయి. ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేయాలంటే లబ్ధిదారులు కచ్చితంగా ఉండాలనే నిబంధన విధించారు. దీంతో మృతి చెందిన, దేశం విడిచి వెళ్లిన లబ్ధిదారులకు చెందిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. లబ్ధిదారుల వారసులు వెళ్లి తమ పేరును రిజిస్ట్రేషన్ చేయాలని, అవసరమైన పత్రాలు అందిస్తామని చెప్పిన అధికారులు కుదరదని చెబుతున్నారు. మృతి చెందిన, అందుబాటులో లేని లబ్ధిదారుల స్థలాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎటువంటి ఆప్షన్ ఇవ్వలేదని అధికారులు సమాధానమిస్తున్నారు. ప్రతి సచివాలయ పరిధిలో తక్కువగా లెక్కించినా ఇటువంటి సమస్యలు ఉన్న ఇళ్ల స్థలాలు పదికిపైగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. రెండు జిల్లాల్లో వెయ్యికిపైగా గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఈ ప్రకారం లెక్కిస్తే దాదాపు పది వేలకుపైగా ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ కాకుండా నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. మృతి చెందిన లబ్ధిదారుల ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వం ఎటువంటి ఆదేశాలూ జారీ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ తోటి లబ్ధిదారులంతా ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నా తమ కుటుంబానికి వచ్చిన స్థలం రిజిస్ట్రేషన్ కాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వానికి ఇది ఎదురుదెబ్బగా తీవ్ర చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మృతి చెందిన, అందుబాటులో లేని లబ్ధిదారుల ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఒక నిర్ణయం తీసుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

విర్డ్ ఆసుపత్రి సేవలు అభినందనీయం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు విర్డ్ ఆసుపత్రి చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కొనియాడారు. స్థానిక విర్డ్ ఆసుపత్రిలో వికలాంగులకు అందిస్తున్న కాలిపర్స్, కృత్రిమ అవయవాలు, వైద్య సేవలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అత్యాధునిక కృత్రిమ అవయవాల విభాగంలో ప్రోస్టాసిస్ 3డి ప్రింట్ తో తయారైన కృత్రిమ అవయవాలను వికలాంగులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ వికలాంగుల్లో శారీరక లోపాన్ని సరిచేసి, వారిలో ఆత్మ విశ్వాసం, ఆత్మస్థైర్యాన్ని నింపే అద్భుత కార్యక్రమం కృత్రిమ అవయవాల పంపిణీ అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలు అభినందనీయులన్నారు. 'విర్డ్' ఆసుపత్రి ఛైర్మన్ ఎస్‌వి.సుధాకరరావు మాట్లాడుతూ ఈ ఆసుపత్రిని 2008లో నెలకొల్పామన్నారు. ప్రోస్టాసిస్ 3డి ప్రింట్ తో తయారైన కృత్రిమ అవయవాలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. గుప్తా ఫౌండేషన్ ఛైర్మన్ మడుపల్లి మోహన్ గుప్తా కాలిపర్స్ అందించేందుకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. 'విర్డ్' ఆసుపత్రిలో వైద్య సేవలు, కృత్రిమ అవయవాల పంపిణీ గురించి ట్రస్టీ సభ్యులు, ఆసుపత్రి డాక్టర్ డాక్టర్ భవ్యచంద్ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ట్రస్టీస్ ఐవిఆర్.సుధాకరరావు, వి.నారాయణమూర్తి, ట్రస్ట్ సభ్యులు డాక్టర్ హమీద్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ విహారి, డాక్టర్ వైవి.నాగేంద్రబాబు, డాక్టర్ సింధు, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.


కృత్రిమ అవయవాలు అందిస్తున్న కలెక్టర్

వ్యక్తిగత శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

వ్యక్తిగత శుభ్రతతోనే పరిపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని, నిత్య క్రమశిక్షణతోనే అది సాధ్యమని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి చెప్పారు. శుక్రవారం సిఆర్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట మాట్లాడుతూ భోజనం చేసే ముందు కచ్చితంగా చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆల్బెండ జోల్ మాత్రలు వేసుకోవడం వల్ల ఎటువంటి ఇబ్బందులూ ఉండవన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేంద్ర కృష్ణ, జిల్లా మేనేజర్ నరేష్ బొప్పన, సిఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపల్ రాజకళా శ్రీధరి పాల్గొన్నారు.

16న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

రైతు, కార్మిక, వ్యవసాయకార్మిక, ప్రజాసంఘాల నేతల పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న సంయుక్త కిసాన్ మోర్చా-కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్-పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని రైతు, కార్మిక, కౌలురైతు, వ్యవసాయ కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం హాలులో సంయుక్త కిసాన్ మోర్చా-కార్మిక సంఘాల ఐక్య వేదిక సంయుక్త జిల్లా సమావేశం బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహా, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు తలారి ప్రకాష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.కృష్ణమాచార్యులు, ఆర్.శ్రీనివాసడాంగే, రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) ఎస్‌కె.భాషా, శ్రామిక మహిళా జిల్లా నేత కె.విజయలక్ష్మి, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి తదితరులు మాట్లాడారు. మతతత్వ విధానాలతో దేశ ప్రజల ఐక్యతను మోడీ ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్ - మతతత్వ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 16న గ్రామీణ భారత్ బంద్ - పారిశ్రామిక సమ్మెలో కార్మికులు, రైతాంగం పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో అన్ని నగర, పట్టణ, మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు సభలు, నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని, క్రాంతి, న్యాయవాది జిల్లెల్లమూడి ప్రసాదరావు, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, పివైఎల్ జిల్లా కార్యదర్శి పి.రమేష్, రైతుసంఘం నాయకులు కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న నేతలు


పుట్రేపు రోడ్డులో కమ్ముకున్న పొగమంచు

తొమ్మిదైనా వీడని పొగమంచు

ప్రజాశక్తి - టి.నరసాపురం


ఉదయం తొమ్మిది కావొస్తున్నా పొగమంచు పోవడం లేదు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సాధారణంగా రాత్రి వేళల్లో మంచు కురుస్తోంది. ఉదయం ఆరు లేదా ఏడు గంటలకల్లా సూర్యోదయం వస్తోంది. ఈ క్రమంలో ఉద్యోగం చేసే వారు ఉద్యోగానికి, వ్యాపారస్తులు వ్యాపారానికి, వ్యవసాయదారులు వ్యవసాయానికి, కూలి పనులు, చేతి వృత్తిదారులు వారి పనులకు ఇలా ఎవరి జీవనోపాధికి వారు పరుగులు తీయాలి. అయితే ఉదయం తొమ్మిది, 10 గంటల వరకు పొగమంచు కమ్ముకుని ఉండటంతో రోడ్లు కన్పించని పరిస్థితి ఉంటోంది. దీంతో రోడ్లపై రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించే సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని వారంటున్నారు. దీంతోపాటు పొగమంచుకి జీడి మామిడి, మామిడి ఇతర పండ్ల చెట్ల పూత మాడి రాలిపోయే ప్రమాదం ఉందని, దీంతో పంట దిగుబడి కష్టమేనని రైతులు వాపోతున్నారు. కొన్ని రోజులుగా ఉదయం వేళల్లో కురుస్తున్న పొగమంచు అన్నివిధాలుగా నష్టమేనని పలువురు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని పుట్రేపు రోడ్డులో దారి కనపడక ఆర్‌టిసి బస్సు డ్రైవర్ పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. వాహనాల లైట్లు వేసుకుని ముందుకు సాగాల్సి వస్తుందని పలువురు డ్రైవర్లు చెబుతున్నారు. దీన్ని బట్టి పొగ మంచు ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది.

ఆశాల నిర్బంధంపై నిరసనల వెల్లువ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విజయవాడలో ఆశా వర్కర్ల మహాధర్నా నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా ఉద్యమాన్ని అణిచివేయాలని చూసిందని, మహిళా పక్షపాతి, దళితుల కోసం పనిచేస్తున్నానని చెప్తున్నటువంటి జగన్మోహన్‌రెడ్డి ఆశాలపై నిరంకుశంగా వ్యవహరించడం సిగ్గుచేటని సిఐటియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు విమర్శించారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా ఆశాలను, సిఐటియు నాయకులను అక్రమ అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఏలూరు, పరిసర ప్రాంతాల్లోని పిహెచ్‌సిల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ అర్ధరాత్రి ఇంటికెళ్లి అరెస్టు చేసి నిర్బంధించడం బాధాకరమన్నారు. చర్చల పేరుతో రాష్ట్ర నాయకత్వాన్ని పిలిచి, బయటకు వస్తుండగా రాష్ట్ర కార్యదర్శిని అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికైనా ఆశా వర్కర్ల సమస్యలు పరిశీలించకపోతే, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాథరావు, యూనియన్ అధ్యక్షురాలు ఎ.విజయ, వరలక్ష్మి పాల్గొన్నారు.

చాట్రాయి: జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే ఆశా కార్యకర్తలకు వేతనాలు పెంచుతామని పాదయాత్ర సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారని, ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని, ఆశా కార్యకర్తలకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, గజవెల్లి వెంకటేశ్వరావు తెలిపారు. మండలంలోని ఆశా కార్యకర్తలు శుక్రవారం చాట్రాయి సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి ప్రభుత్వ హాస్పటల్ వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కరోనా సమయంలో మరణించిన ఆశ కార్యకర్తలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని, ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలని వారి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వ్యవసాయ కార్మిక సంఘం పూర్తి అండగా ఉంటుందని తెలిపారు. ఈ ధర్నాలో ఆశా కార్యకర్తల యూనియన్ మండల నాయకులు ఎస్.పుల్లమ్మ, యురేనిక, 40 మంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


పోలవరంలో..

కొయ్యలగూడెం : సిఐటియు రాష్ట్రకేంద్రం ఆఫీసులో 300 మందికిపైగా ఉన్నటువంటి ఆశలను బయటకు రాకుండా చేసి నిర్బంధించటం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రాంబాబు అన్నారు. ఆశ వర్కర్స్ సమస్యల పరిష్కారానికి విజయవాడ మహాధర్నాకు వెళ్లిన వారిపై కేసు నమోదు చేసి, అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పిహెచ్‌సి వద్ద శుక్రవారం ఆశా వర్కర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ర్యాలీగా బయ్యనగూడెం సెంటర్‌లో సమస్యలపై రాస్తారోకో చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఈనెల 10న ఎంఆర్ఒ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం కూడా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.నలిని, కె.వెంకటలక్ష్మి, జి.కోమలి, డి.జయలక్ష్మి, విజయలక్ష్మి, గంగారత్నం పాల్గొన్నారు.


బుట్టాయగూడెంలో ఎంఎల్‌ఎకు వినతి ఇస్తున్న ఆశాలు

కలిదిండి : విజయవాడలో జరిగిన మహా ధర్నాపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బందకాండకు నిరసనగా మండలంలోని మూలలంక, కోరుకొల్లు, కలిదిండి పిహెచ్‌సిల వద్ద ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. అరెస్ట్ చేసి నిర్బంధంలో ఉన్న ఆశా వర్కర్లను విడుదల చేయాలని, తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు డి.అరుణ కుమారి, దాసరి విజయ, షేక్ రహీమున్నిసా పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశాలు ప్రజాస్వామ్యబద్ధంగా విజయవాడ ధర్నాకు పిలుపునిస్తే ధర్నాను అడ్డుకునేందుకు ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి గృహ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులను చేయడాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి నాగమణి తీవ్రంగా ఖండించారు. బుట్టాయగూడెంలోని సిఐటియు నాయకులు, ఆశ కార్యకర్తల వద్ద పోలీసులు పహారా ఏర్పాటు చేయడం, ఆశాలకు ఎక్కడపడితే అక్కడ నోటీసులు ఇచ్చి ఇబ్బందులు గురి చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ నిర్బంధకాండను నిరసిస్తూ మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజుకి సమస్యలతో కూడిన వినతిని అందజేశారు. ఇప్పటికైనా ఆశాల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలందరూ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, గంగాభవాని, శాంతి కుమారి పాల్గొన్నారు.

నూజివీడు : ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ మహాధర్నా సందర్భంగా ఆశా వర్కర్స్‌పై రాష్ట్ర ప్రభుత్వ దాడిని ఖండిస్తూ శుక్రవారం నూజివీడు పట్టణంలో కోనేరు పేటని ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద ఆశా వర్కర్స్ నిరసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి సిఐటియు మండల కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆశలకు వర్తింపచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు కమల, నాగమణి, స్వాతి, రాధాకుమారి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆశా వర్కర్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆగిరిపల్లి మండల సిఐటియు కార్యదర్శి ఆర్.చంటి డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆశావర్కర్స్ స్థానిక పిహెచ్‌సి వద్ద సిపిఎం, సిఐటియు ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ నీలాంబరం, యశోద, సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: చలో విజయవాడకు వెళ్తున్న ఆశా వర్కర్లను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండలంలోని పిహెచ్‌సిల వద్ద సిఐటియు, ఆశాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆశాలను అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గు చేటని సిఐటియు మండల కార్యదర్శి కొండలరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చిరుద్యోగుల చిరు కోరికలను తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశాలు శోభా, రమణ, నాగమణి, నగ్మా పాల్గొన్నారు.

పోలవరం : ఉద్యోగ భద్రత కోరిన ఆశా వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వ దౌర్జన్య వైఖరి నశించాలని సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి అన్నారు. శుక్రవారం పోలవరం మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఆశా వర్కర్లపై దౌర్జన్యాలకు ప్రభుత్వ వైఖరి నశించాలంటూ నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుమారి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర మహిళలు నా ఆడపడుచులు.. నా తల్లులు అంటూ వారు వేసిన ఓట్లతో అధికారంలోకి వచ్చి నేడు ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడిగినందుకు మహిళలని కూడా చూడకుండా పోలీసులతో దాడులు చేయించి, అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. అనంతరం వింజరం పిహెచ్‌సిలో వైద్యాధికారి మురళీధర్‌కి వినతిని సమర్పించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ మండల కార్యదర్శి కుసుమ కుమారి, నాయకులు బీరా రత్నాజీ, గోకా అరుణ, బి.రామలక్ష్మి పాల్గొన్నారు.


చింతలపూడిలో..

ఆశా వర్కర్లు తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ శాంతియుతంగా పోరాడుతుంటే వారిపై మహిళలని కూడా చూడకుండా వైసిపి ప్రభుత్వం పోలీసులతో దౌర్జన్యానికి పాల్పడడం అమానవీయమని, దీనిని టిడిపి పూర్తిగా ఖండిస్తుందని టిడిపి మండల నాయకులు మంగినకొండ అన్నారు. ఆశాలకు టిడిపి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు ఎడ్ల వినోద్, ఆకుల రాజా, మంగిన పోసి రత్నం, మేడుం పార్వతి పాల్గొన్నారు.

చింతలపూడి: మండల ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పిహెచ్‌సి, యుపిహెచ్‌సిలో డి వార్మింగ్ డే ని బాయ్ కట్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశాల అరెస్ట్‌లను, నిర్బంధాన్ని నిరసిస్తూ ఎర్రగుంటపల్లి పిహెచ్‌సి, రాఘవాపురం పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి సరళ, అశ్విని, వరలక్ష్మి, అన్నమ్మ పాల్గొన్నారు.

కొత్త అంశాలపై పరిశోధించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు కొత్త అంశాలపై పరిశోధనలు చేయాలని ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్ ఎల్లా శివప్రసాద్ అన్నారు. చింతలపూడి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యాన రాకెట్ సైన్స్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపే తీరును, ముఖ్య భాగాలు, ప్రముఖ ఉపగ్రహాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్‌జెకె.నరేంద్రకుమార్, జి.జీవన, మౌనిక, డాక్టర్ సయ్యద్ మీర్ హాసిం, వి.మదన్మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివప్రసాద్

స్ట్రాంగ్‌రూము పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని సారధి ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమును ఆర్‌డిఒ వై.భవానిశంకరి, డిఎస్‌పి అశోక్‌కుమార్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూము వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని డిఎస్‌పికి ఆర్‌డిఒ సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విశ్వనాథశాస్త్రి, సిఐ మూర్తి, విఆర్‌ఒలు రాజాబాబు, కిరణ్ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఆర్‌డిఒ, డిఎస్‌పి

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా వృత్తి విద్యాధికారి బి.ప్రభాకర్‌రావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏడు కేంద్రాలలో జరిగిన ఈ పరీక్షలకు 780 మందికి 632 మంది హాజరయ్యారన్నారు. 148 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - ఉంగుటూరు

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలు, వాస్తవ పరిస్థితులను గుర్తించేందుకు తహశీల్దారు, నియోజకవర్గ ఓటు నమోదు సహాయ అధికారి శివయ్య, ఉంగుటూరు ఎంపిడిఒ శర్మ, చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ శుక్రవారం పలు పిఎస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానంగా పోలింగ్ కేంద్రాల ఆవరణలో ఓటర్లకు నీడ, తాగునీటి వసతులతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. ఉంగుటూరు, నీలాద్రిపురం, కొత్తగూడెం పోలింగ్ కేంద్రాలను స్థానిక బిఎల్ఒల సాయంతో పరిశీలించారు.

ముసునూరు: ఎన్నికల సమయానికి అన్ని పోలింగ్ కేంద్రాల్లో తప్పనిసరిగా అన్ని వసతులు సమకూర్చుకోవాలని ఎస్ఐ పి.వాసు, రెవెన్యూ అధికారి ఏమిలికుమార్, ఎంపిడిఒ చాగంటి పద్మావతిదేవి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని కాట్రేనిపాడు, చిల్లబోయినపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్ఐ ఎల్లాప్రగడ వెంకటేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

ప్రజాశక్తి - మండవల్లి

మినుము పైరులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చునని ఎడి జి.వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ కుర్రాల్ల యేసు, మరియమ్మ ఆధ్వర్యాన శుక్రవారం వ్యవసాయ సలహా మండలి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మినుము పంటకు ఆశించే తీవెదేలను ముందుగానే గమనించుకుని, నివారించుకోవాలని అన్నారు. మినుములో పూత పురుగును నివారించుకోవడానికి నీ వాల్యూ రాన్ మందును స్ప్రే చేసి పురుగును నివారించవచ్చని తెలిపారు. రసం పీల్చే పురుగు నివారణకు రోగార్(డైమిథోఎట్) మందును 2.5 ఎమ్ఎల్ లీటరు నీటికి కలిపి స్ప్రే చేసి పురుగును నివారించుకోవచ్చు అని అన్నారు. మినుము పంటలో వేప నూనె కూడా స్ప్రే చేయాలని తెలిపారు. అనంతరం మినుము పంట సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఇ జరీనా పాల్గొన్నారు.

వంద రోజులు పని కల్పించాలి

జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆరవల్లి రాము

ప్రజాశక్తి - ముసునూరు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం ద్వారా ప్రతి పేదవాడికి వంద రోజుల పనిదినాలు కల్పించాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆరవల్లి రాము పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఉపాధిహామీ కార్యాలయం వద్ద మండలంలోని 16 గ్రామ ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు వున్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలన్నారు. రైతులు తమ పొలంలో పాం పౌండ్ తవ్వించుకోవాలని, పొలాల్లోని అంతర్గత రహదారులకు రెండు పక్కల కందకాలు తీయించాలని తెలిపారు. పని జరిగే ప్రదేశంలో ఇసి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరిగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడి పి.శ్రీదేవి పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలో ఉపాధి హామీ చట్టంలో సోషల్ ఆడిట్ జరగనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15.50 కోట్లు వెచ్చించారు. వాటిలో రూ.11.39 కూలీల వేతనాలు, రూ. 4.11 కోట్లతో మెటీరియల్ కాంపోనెంట్లతో రూ.5.13 లక్షలతో పలు అభివృద్ధి పనులు నిర్వహించారు. చేసిన పనులపై ఈ శుక్రవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తారు. అనంతరం పబ్లిక్ హియరింగ్ ఉంటుందని ఎంపిడిఒ డిఎస్ఎస్ శర్మ అన్నారు. శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సహాయకులు, సోషల్ ఆడిట్ వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్ఆర్‌జి డి.రామచంద్రరావు వున్నారు.

టిడిపి, జనసేన కూటమిదే విజయం

దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్



భవిష్యత్తు గ్యారంటీలో చింతమనేని

అమలు చేయడం చేతకాని హామీలను ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఆ హామీలను అమలు చేయమని కోరిన వారిపై కక్షసాధింపుగా దాడి చేయిస్తున్నారని, మరో రెండు నెలల్లో ఈ నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడటానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్, దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలం అప్పనప్రోలులో శుక్రవారం జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన 6 గ్యారంటీ పథకాల విశిష్టతను ప్రజలకు వివరించారు. తమ గ్రామానికి విచ్చేసిన చింతమనేనికి పూల జల్లులు, మహిళల మంగళ హారతులతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. స్థానిక గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన ఇరు పార్టీల జెండాలను టిడిపి, జనసేన నాయకులతో కలిసి చింతమనేని ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లావేటి శ్రీనివాస్, జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు గ్రామాల్లోని విద్యుత్ లైన్స్, విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఎఇ పి.రవికుమార్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, ప్రజలు ఈ విషయం గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మహిళాభివృద్ధిని కాంక్షించే వ్యక్తి జగన్

ఆసరా చెక్కుల పంపిణీలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

మండవల్లి: మహిళాభివృద్ధిని కాంక్షించే వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది కేవలం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని కైకలూరు నియోజకవర్గం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు స్పష్టం చేశారు. స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన నాలుగో విడత ఆసరా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చెప్పిందంటే చేస్తాడు అనే నమ్మకాన్ని కలిగించిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని అది దృష్టా అక్క చెల్లెమ్మల విషయంలో అక్షరాల నిజమైందని ఆయన అన్నారు. నాలుగో విడత ఆసరా రూ.9.72 కోట్లను అక్కాచెల్లెమ్మల ఖాతాల్లో జమచేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ సభ్యులు కారుమూరు సునీల్, ఎంపిపి జయ మంగళ వెంకటరమణ, ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, చందన ఉమామహేశ్వర రావు, జెడ్‌పిటిసి ముంగర విజయనిర్మల పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - మండవల్లి

రొయ్యల చెరువుపై కాపలాదారుడుగా పనిచేస్తున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలోని కాకతీయ నగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు గ్రామానికి చెందిన శివప్రసాద్‌కు కాకతీయ నగర్‌లో ఆరు ఎకరాల రొయ్యల చెరువు ఉంది. అయితే చావలపాడుకు చెందిన ధోనిపాటి అబ్రహం శివప్రసాద్ చెరువుకు కాపులధారునిగా పనిచేస్తున్నాడు. శివప్రసాద్ ఎప్పటిలాగానే చెరువులో మేత వేయడానికి చెరువు దగ్గరకు వెల్లగా చెరువు గట్టుమీద ఉన్న షెడ్‌లో అబ్రహం దూలానికి ఉరివేసుకొని వేలాడుతూ ఉండడాన్ని గమనించాడు. చనిపోయాడని నిర్ధారించుకుని అబ్రహం తల్లి సుందరమ్మకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న తల్లి ఉరి వేసుకుని మృతి చెందిన కుమారుడుని చూసి కన్నీటి పర్యంతం అయ్యింది. అనంతరం తల్లి సుందరమ్మ ఇచ్చిన రిపోర్ట్‌పై అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి చేయాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ర్యాలీ

జిల్లాలో వెట్టి చాకిరి నిర్మూలన కోసం తమ వంతుగా అందరూ కృషి చేయాలని, వెట్టి చాకిరి అనేది చట్టరీత్యా నేరం, సాంఘిక దురాచారం అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యాన జిల్లాలోని కార్మిక అనుబంధ శాఖల సహకారంతో వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కోర్టు నుంచి ఫైర్ స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉప కార్మిక కమిషనర్ శ్రీనివాస్ ర్యాలీలో పాల్గొన్న వారితో వెట్టి చాకిరీవ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో రత్నప్రసాద్ మాట్లాడుతూ ఎటువంటి నిర్బంధం లేకుండా కార్మికులు స్వేచ్ఛగా పనిచేసుకునేందుకు యజమానులు తగిన అవకాశం కల్పించాలని, వెట్టి చాకిరీ వ్యవస్థ రహిత జిల్లాగా ఏలూరును చేయడానికి సమాజంలోని అందరూ సహరించాలని కోరారు. ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు, కార్మికులు, కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల కార్మికులను గుర్తించి సంబంధిత రెవెన్యూ, పోలీసు, కార్మిక శాఖల దృష్టికి తీసుకువచ్చి వారి విముక్తికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ జి.నాగేశ్వర రావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్య చక్రవేణి, దిశా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్‌పెక్టర్ క్రాంతిప్రియ, ప్యానల్ లాయర్లు, కార్మిక శాఖ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతలపూడి: 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలు చదువుకోవాలని, కర్మాగారాల్లో, రైతుల దగ్గర పాలేరులుగా, రోజువారీ కూలీలుగా జీవించకూడదని జూనియర్ సివిల్ న్యాయమూర్తి మధుబాబు అన్నారు. చింతలపూడి పట్టణంలో ఆదర్శ హైస్కూల్‌లో వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్షతో పాటు, జరిమానా కూడా వుందని తెలిపారు. ఎవరినైనా గుర్తించిన యెడల చైల్డ్‌లైన్ 1098, పోలీస్ నంబర్ 100, కోర్టుకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పింగుల్ డేవిడ్ రాజు, సోషల్ వర్కర్ ఎమ్‌డీ అక్బర్ అలీ పాల్గొన్నారు.

ఎస్ఐ స్వామికి సత్కారం

ఉంగుటూరు: అంకిత భావంతో పనిచేసే ఏ పోలీసు అధికారికైనా ప్రజామన్ననలు ఉంటాయనడంలో ఎస్ఐ కాశి స్వామి ఉదహరణగా నిలిచారని ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అన్నారు. చేబ్రోలు పోలీసుస్టేషన్ నుంచి దెందులూరు బదిలీ అయిన ఎస్ఐ కాశి స్వామికి వీడ్కోలు, అభినందన సత్కారం పోలీసులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యాన గురువారం రాత్రి నారాయణపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి చేసిన సేవలపై పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు కొనియాడారు. నిడమర్రు సిఐ ఎం.సుభాష్ మాట్లాడుతూ పోలీసులపై ప్రజల్లో సాధారణంగా ఉండే నెగెటివ్ భావజాలాన్ని అధిగమించి, అందరి మన్ననలు పొందిన స్వామి డ్యూటీలో అంకిత భావంతో పనిచేసి క్లిష్టమైన కేసుల్లో ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు, పోలీసుల సిబ్బంది ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు, నిడమర్రు, గణపవరం ఎస్ఐలు ఎ.మణికుమార్, శ్రీను, వి.వెంకటేశ్వరావు, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు విష్ణుమూర్తి, నారాయణపురం సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్ పారారావుబాబ్జి, పలువురు సర్పంచులు పాల్గొన్నారు. స్వామి దంపతులను సత్కరించి జ్ఞాపిక అందించారు.

బయాలజీ టీచర్ ఏర్పాటు

కుక్కునూరు: కుక్కునూరు ప్రాథమిక ఉన్నత పాఠశాల యాజమాన్యం అభ్యర్థన మేరకు కుక్కునూరు సర్పంచి రావు మీనా వినోద్, 9వ తరగతి, 10వ తరగతి విద్యార్థులకు బయాలజీ టీచర్‌ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచి రావు మీనా వినోద్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో విద్యార్థులకు రెగ్యులర్ బయాలజీ టీచర్ లేక, సిలబస్ కంప్లీట్ అవ్వక ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థుల భవిషత్‌ను దృష్టిలో ఉంచుకొని సర్పంచి సొంత నిధులతో ఒక టీచర్‌ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సర్పంచికి ధన్యవాదాలు తెలియజేశారు.

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యం : జనసేన

కుక్కునూరు: రానున్న ఎన్నికల్లో పోలవరం నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థి గెలుపుకు జనసైనికులు కృషి చేయాలని శుక్రవారం జనసేన కార్యాలయంలో మండల అధ్యక్షుడు యుగంధర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు కుక్కునూరు మండల కేంద్రంలో జరిగే సమావేశానికి ప్రతి ఒక్కరు హాజరవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గోపాలకృష్ణ, మోదుంపురపు వెంకన్న బాబు, లక్ష్మణస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

నేడు ఏలూరులో వైఎస్ఆర్ ఆసరా

ఏలూరు టౌన్ : ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈనెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు నిర్వహించడం జరుగుతుందని నగరపాలక సంస్థ కమీషనర్ ఎస్.వెంకట కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని, నగర మేయర్ షేక్ నూర్జహాన్, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని వెంకటకృష్ణ తెలియజేశారు.

డిఎన్ఆర్‌ను కలిసిన తహశీల్దార్

ముదినేపల్లి: ముదినేపల్లి మండల నూతన తహశీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్ఎల్ఎన్ కుమారి శుక్రవారం కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావును ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛము అందజేశారు. ఈ సందర్భంగా డిఎన్ఆర్ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ మండలాభివృద్ధికి తోడ్పడాలని ఆమెకు సూచించారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులు కష్టపడి కాక ఇష్టపడి చదవడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చని పొలసానిపల్లి బాలయోగి గురుకులం బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణ తెలిపారు. పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ మానవత ద్వారా కెరీర్ గైడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, నైతిక విలువలు కాపాడుకోవడం అనే అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మానవత కెరీర్ గైడెన్స్ జిల్లా డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విలువలతో కూడిన ఆలోచనలతో చేరాల్సిన లక్ష్యాలను నిర్ణయించుకోవాలని కోరారు. మానవత సంస్థ కెరీర్ గైడెన్స్ కమిటీ కన్వీనర్, మానసిక విశ్లేషకులు అంబటి జయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు ఆత్మరక్షణ చేసుకునే విధానం పట్ల అవగాహన కలిగి ఉండాలని, అవసరం మేరకు పోలీసులు ప్రత్యేకించిన యాప్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఇదే క్రమంలో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇస్తూ తమ ముందు ఉన్న లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు పి.తేజస్విని, డి.మమతలకు వారు సాధించిన విద్యా ప్రమాణాల ఆధారంగా నగదు పురస్కారం, పుస్తకాలు, మెమెంటోలు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఇదేవిధంగా ఇంటర్ విద్యార్థులు ఎన్.వేదిక, డి.మమత, హర్షిత, సౌజన్యలకు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా కన్వీనర్ రామిశెట్టి గంగాధర రావు, భీమడోలు శాఖ ఛైర్‌పర్సన్ గుళ్ల నూకరాజు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ నిర్వీర్యం

ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి బి.సోమయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



సాజ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఈ మధ్యకాలంలో విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని, కాని అవేవి పేదవారికి ఉపయోగపడే విధంగా లేవని ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి బి.సోమయ్య అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులు స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముందు సోమయ్య టీచర్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉచితంగా విద్య, వైద్యం, రైతులకు రుణాలు, కార్మికులకు చేయూత పనులు అందించాలని, పరిశ్రమలు నిర్మించాలని, కాని ఈరోజు ప్రభుత్వాలు అవేమీ చేయటం లేదని విమర్శించారు. విద్యా రంగంలో మార్పులు చేయటానికి ప్రయోగశాలగా ఆంధ్రప్రదేశ్ మారిపోయిందని, ఏ మార్పులు చేయాలన్నా ముందు ఆంధ్రప్రదేశ్‌లో చేస్తున్నారన్నారు. నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యార్థుల జీవితాలను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, అధ్యక్షులు వి.ఠాగూర్, రాజా పాల్గొన్నారు.

నూజివీడు పట్టణ సిఐను సస్పెండ్ చేయాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆశావర్కర్ల మహాధర్నా నేపథ్యంలో నూజివీడులో అరెస్టులు చేసి ఆశ వర్కర్లను, సిఐటియు నాయకులను అసభ్య పదజాలంతో దూషించి, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహాపై దౌర్జన్యం చేసిన నూజివీడు పట్టణ సిఐపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమావేశం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం హాలులో సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ మహాధర్నా సందర్భంగా ముందస్తు అరెస్టులు చేశారన్నారు. అరెస్ట్ చేసిన వారిని నూజివీడు సారధి ఇంజనీరింగ్ కాలేజీకి తరలించారని, భోజనాలు చేస్తున్న సందర్భంలో అరెస్ట్ అయిన వారి పేర్లు చెప్పాలని ఒత్తిడి చేశారని చెప్పారు. భోజనాలు పూర్తైన తర్వాత అందరం చెబుతామని చెబుతుండగా నూజివీడు పట్టణ సిఐ మూర్తి భోజనాలు పెట్టకండి, ఆపేయ్యండని అసభ్య పదజాలంతో దూషించడం దారుణమని విమర్శించారు. మహిళల పట్ల ఆ రకంగా మాట్లాడడం సరికాదని చెప్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహాపై సిఐ దూసుకు వచ్చి గెంటుకుంటూ ఇష్టానుసారం మాట్లాడటమే కాకుండా, నీ సంగతి తేలుస్తానని దౌర్జన్యం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నర్సింహాపై అక్రమంగా పోలీసు కేసు బనాయించడం తగదన్నారు. పోలీసు జిల్లా ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి నూజివీడు టౌన్ సిఐపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఘంటా పాపారావు పాల్గొన్నారు.

'కైకలూరు'లో పెరిగిన అరాచకాలు

మాజీ మంత్రి కామినేని

ప్రజాశక్తి - ముదినేపల్లి

కైకలూరు నియోజకవర్గంలో తీవ్రస్థాయిలో వైసిపి అరాచకాలు పెరిగిపోతున్నాయని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సంకర్షణ పురం గ్రామంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమావేశంలో కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ పేదవాళ్లకి, పెత్తందారులకు యుద్ధం అని సిఎం జగన్మోహన్ రెడ్డి అంటున్నారని, దేశంలోని రాజకీయ నాయకుల్లో ఆయన కంటే డబ్బున్న వారు లేరని మండిపడ్డారు. అందరూ కలిసికట్టుగా ఈ అరాచక పాలన మీద పోరాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు హాజరైయ్యారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - చాట్రాయి

మండలకేంద్రమైన చాట్రాయి లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది శుక్రవారం పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దామెర ఉష పాల్గొని విద్యార్థులు ఎదుగుదల లోపానికి, రక్తహీనతకు లోనవ్వకుండా నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి ఎ.శ్రీనివాసరెడ్డి, ఆరోగ్య సిబ్బంది రమణ, ఎఎన్ఎం, పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒక ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు 92.30 శాతం నులిపురుగు నివారణ(ఆల్బెండజోల్) మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు జాహ్నవి, హేమంత్ తెలిపారు. 28 పాఠశాలలు, 19 అంగన్వాడీలలో అర్హులైన 4,536 మంది పిల్లలకు గాను 4,187 మంది పిల్లలకు పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన వారికి ఈనెల 16వ తేదీన పూర్తి చేయడం జరుగుతుందని వైద్యాధికారులు అన్నారు.

ముసునూరు: ప్రతి విద్యార్థి చిన్న వయస్సు నుంచే ఆరోగ్య సూత్రాలు పాటించాలని మండల ఎంపిడిఒ చాగంటి పద్మావతిదేవి అన్నారు. శుక్రవారం మండలకేంద్రమైన ముసునూరు ప్రాథమిక పాఠశాలలో జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భవాని, వహీంజికల్, యం.హన్నమణి పాల్గొన్నారు.

టి.నరసాపురం : నులిపురుగు నివారణతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని మండల వైద్యాధికారిణి జె.కల్పనా రాణి తెలిపారు. జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి: జాతీయ నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని విద్యార్థులందరికీ వైద్య సిబ్బంది డి వార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. ముదినేపల్లి, గురజ, దేవపూడి పిహెచ్‌సిల పరిధిలోని విద్యార్థులకు డి వార్మింగ్ మాత్రలను పంపిణీ చేయడం జరిగినట్లు ఆయా పిహెచ్‌సిల వైద్యులు తెలిపారు. మిగిలిన వారికి ఈనెల 16వ తేదీన మరోసారి డి వార్మింగ్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ఇ-చలానాలు రద్దు చేయాలి

ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి

ఏలూరు అర్బన్: ఏలూరు నగరంలో ఆటోలు, టాక్సీలపై విధించిన ఇ-చలానాలను రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఫెడరేషన్ నగర కమిటీ సమావేశంలో గోపి మాట్లాడుతూ ఏలూరు నగరంలో సెన్సార్ కెమెరాలను ప్రభుత్వం సరైన దిశలో అమర్చలేదని, జీబ్రా లైన్ వైలేషన్ పేరుతో అడ్డగోలుగా ట్రాఫిక్ పోలీసు విభాగం ఆటో, ట్యాక్సీలపై చలానాలు విధిస్తోందని, ఒక్కొక్క ఆటోపై రూ.300 నుంచి రూ.20 వేల వరకు ఇ-చలానాలు విధించడం దారుణమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నెంబర్ 21 వల్ల జరిమానాలను అనేక రెట్లు పెంచడం జరిగిందన్నారు. అసలే కిరాయిలు లేక సతమతమవుతున్న డ్రైవర్ల పాలిట ఇ-చలానాలు ఉరితాడులా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కలెక్టర్‌కి, ట్రాఫిక్ సిఐకి సిఐటియు యూనియన్ ఇ-చలానాల విషయాల్ని వినతి పత్రం ద్వారా అందజేసి, చలానాలను రద్దు చేయాలని కోరామని, నేటికీ రద్దు చేయాలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భేషరతుగా ఇ-చలానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈనెల 12వ తేదీన డ్రైవర్లందరిని సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశానికి బుద్ధ నాగ సూరిబాబు అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఆటో యూనియన్ నాయకులు మెరుగు రాఘవ, చక్రాల అమర్ కుమార్ పాల్గొన్నారు.